ఈనాడు
సిద్దిపేట
సోమవారం అక్టోబరు 14, 2024


# పేదలకే ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి


మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో విజయ దశమి సందర్భంగా జమ్మిపూజ నిర్వహించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. హుస్నాబాద్‌లో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. అక్కన్నపేటలో పారిశ్రామిక పార్కు అభివృద్ధికి స్థలం కేటాయించామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద శనివారం రాత్రి నిర్వహించిన రామ్‌లీలా కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శివాలయం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన జమ్మిపూజ కార్యక్రమంలో మంత్రితోపాటు పుర అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత పాల్గొన్నారు.

**60 రోజుల్లో కులగణన పూర్తి చేస్తాం..:** రాష్ట్రంలో బీసీ కులగణన ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యంగా బీసీ కమిషన్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సర్వే చేస్తుందన్నారు. బీసీ కమిషన్‌కు అవసరమైన మౌలిక వసతులు లేవని, సర్వే చేసి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు.

# సర్కారు సమాయత్తం

- నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు
- మొత్తం 417 కేంద్రాలు.. 66 కౌంటర్లు

న్యూస్‌టుడే- గజ్వేల్, సిద్దిపేట





రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన (వానాకాలం సీజన్) ధాన్యాన్ని మద్దతు ధరకు కొనిదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 3న గజ్వేల్ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం 21 కేంద్రాలు ప్రారంభిస్తున్నామని, వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

**అధిక దిగుబడులొచ్చే అవకాశం..**

సాగునీటి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరుండటం, ఉచిత విద్యుత్తుతో అన్నదాతలు చాలామంది వరి పంట సాగు చేశారు. ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశాలు ఉండటంతో 4 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనేందుకు లక్ష్యంగా నిర్ణయించామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గత సీజన్‌లో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట సెక్టార్లుగా విభజించారు. వాటి పరిధిలో గుత్తేదారులు నిర్దేశిత కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణా చేయనున్నారు.

**వారం రోజుల్లో పూర్తి స్థాయిలో..**

– ప్రవీణ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

జిల్లాలో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చి ధాన్యం కొంటాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నాం. కొనుగోళ్ల తరవాత మూడ్రోజుల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కృషి చేస్తాం. సన్నాలకు రూ.500 బోనస్ అందించనున్నాం.

మద్దతు ధరలు (క్వింటాకు) ఇలా..
ఎ గ్రేడు ధాన్యం రూ.2,320
బి గ్రేడుకు రూ.2,300

విభాగాల వారీగా కేంద్రాలు ఇలా..
ఐకేపీ: 211
పీఏసీఎస్: 200
మెప్మా: 06

గన్నీ సంచులు..
కావాల్సినవి: 100 లక్షలు
అందుబాటులో ఉన్నవి: 45 లక్షలు
కావాల్సిన టార్పాలిన్లు: 8,400
అందుబాటులో ఉన్నవి: 8వేలు

యంత్ర పరికరాలు..
తేమ యంత్రాలు: 532
వేయింగ్ స్కేళ్లు: 660
ప్యాడీ క్లీనర్లు: 588

జిల్లాలో సాగు: 3,68,000 ఎకరాలు
సన్న రకం: 66,000 ఎకరాలు
దొడ్డు రకం: 3,02,000 ఎకరాలు
దిగుబడి అంచనా: 9 లక్షల మె.ట.
ధాన్యం కొనుగోలు లక్ష్యం: 4 లక్షల మె.ట.

# దసరా పరమార్థం.. విజయమే లక్ష్యం


వేడుకలకు హాజరైన ప్రజలు


రంగధాంపల్లి వద్ద..


రావణాసురుడి బొమ్మకు నిప్పంటిస్తున్న హరీశ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విజయ దశమి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి పట్టణంలోని శ్రీఉమాపార్థివ కోటిలింగేశ్వర ఆలయం, నర్సాపూర్, రంగధాంపల్లి, రూరల్ ఠాణా చౌరస్తాలోని హనుమాన్ ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వేడుకల్లో పాల్గొని రావణాసురుడి బొమ్మలను దహనం చేసి.. పాలపిట్టను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే సిద్దిపేట నుంచి తిరుపతికి రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. 15వ ఆర్థిక సంఘం సైతం సిద్దిపేట స్టీల్ బ్యాంకు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిందన్నారు. రంగనాయక్ సాగర్ జలాశయం కింద లక్ష ఎకరాల్లో రెండు పంటలు పండుతున్నాయన్నారు. అనంతరం ఇమాంబాద్‌లో ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిద్దిపేటలోని మార్కండేయ దేవాలయం వద్ద బురుజు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు హాస్య కళాకారుడు ఆర్.ఎస్.నంద (సదన్న) హాజరయ్యారు.

# పండగ ముగిసింది.. పట్నం పిలిచింది



మండల పరిధి దుద్దెడలో రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం వాహనాల రద్దీ పెరిగింది. సుమారు 2 కి.మీ. మేర బారులుదీరడంతో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రజలు సొంతూళ్లకు వచ్చి తిరిగి హైదరాబాద్ వెళుతుండడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దుద్దెడ టోల్ గేట్ దాటడానికి వాహనదారులు అరగంటకు పైగా ఆగాల్సి వచ్చింది.

- న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

## నరసన్న సేవలో ఎంపీ రఘునందన్


ఆలయ సన్నిధిలో కుటుంబ సమేతంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వయంభువుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అందజేశారు.



## మహిళల కోలాటాలు.. యువత నృత్యాలు


పాల్గొన్న చిన్నారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: తొమ్మిది రోజులపాటు కొనసాగిన శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా పలు ఆలయాలు, కాలనీల్లో అసోసియేషన్ల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. యువత నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ శోభాయాత్ర ద్వారా పట్టణంలో ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. కోమటిచెరువు వద్ద బల్దియా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# అసంపూర్తి పనులు.. తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్


కంకర పోసి మధ్యలోనే వదిలేసి..


ప్రమాదకరంగా వంతెన రహదారి

రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం రహదారులు నిర్మిస్తోంది. సిద్దిపేట నియోజకవర్గం సిద్దిపేట అర్బన్, సిద్దిపేట గ్రామీణం, నారాయణరావుపేట, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక మండలం దుద్దెడ చౌరస్తా వరకు ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు వరుసల రహదారులను గత ప్రభుత్వం ప్రారంభించింది. ఇంతవరకు బాగానే ఉన్నా అసంపూర్తి పనులతో ఇబ్బందులు తీరడం లేదు. పనులు పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిన రహదారిపై రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**పలుచోట్ల కల్వర్టులు ధ్వంసం**

నారాయణరావుపేట మండలం మల్యాలలో రహదారి పనుల్లో భాగంగా వంతెన నిర్మించారు. ఎగుడు, దిగుడుగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరో చోట కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. వర్షానికి నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోచోట కంకర పోసి వదిలేయడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. సిద్దిపేట గ్రామీణ మండలం రావురూకుల వద్ద పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై కయ్యలు పడి ఇబ్బందికరంగా మారింది. వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్ సమీపంలో రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. కొంత దూరం మాత్రమే పూర్తి చేయాల్సి ఉన్నా గుత్తేదారు పట్టించుకోకపోవడంతో గుంతలు పడి నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ వాహన చోదకులకు గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

# బడి పిల్లలకు రాగి జావ

కార్యక్రమం తిరిగి అమలు


రాగి జావ తాగుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, సిద్దిపేట: ఉదయం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ మాసం వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలుగా నిలిచిపోయింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జావ అందనుంది.

**వారంలో మూడు రోజులు...** జిల్లాలో మొత్తం 970 ప్రభుత్వ పాఠశాలలుంటే 1 నుంచి 10వ తరగతి వరకు 78,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ఇలా...

| కేటగిరి | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| ప్రాథమిక | 629 | 40,000 |
| ప్రాథమికోన్నత | 114 | 18,500 |
| ఉన్నత | 227 | 20,000 |

**ఆదేశాల మేరకు..:** శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాధికారి

రాగిజావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాగి జావ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం. ఫలితంగా వారిలో చురుకుదనం పెరుగుతుంది.

**కొన్నిచోట్ల అంతరాయం..** ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు. గతేడాది రాగి జావ పథకం విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందలేదు. శ్రమకు తగిన ఫలితం లేదంటూ వంట ఏజెన్సీలు మొరాయించడం, పిండి, బెల్లం సరఫరా చేయడంలో జాప్యం జరగడంతో కొన్ని చోట్ల తరచూ జావ అందించడంలో అంతరాయం ఏర్పడేది. అలాంటి ఇబ్బందులను అధిగమించి విద్యార్థులకు నిరంతరాయంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## 15న టేబుల్ టెన్నిస్ ఎంపికలు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఈనెల 15వ తేదీన మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు ఓపెన్ కేటగిరిలో స్త్రీ, పురుషులకు పోటీలు ఉంటాయి. ఆసక్తి గల వారు ఉదయం 9గంటలలోపు పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో పోటీల నిర్వాహకులు రవితేజ, అనిష్‌లను సంప్రదించాలి. మరిన్ని వివరాలకు చరవాణి నం.9133668875, 9014279221కు సంప్రదించాలని సూచించారు.

## ఆరాధనలు చేపట్టి... ఆశీర్వదించి


ప్రార్థన చేస్తున్న ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువులు

మెదక్ అర్బన్: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం క్రీస్తు నామస్మరణతో మార్మోగింది. గురువులు చర్చిలో శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించి ఆరాధన చేపట్టారు. ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు జైపాల్ దైవసందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివచ్చి ఏసయ్యను దర్శించుకున్నారు. గురువులు రిచర్డ్, శ్రీనివాస్ ఆశీర్వచనాలు అందించారు. చర్చి ప్రాంగణంలోని శిలువ ముందు భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టారు.

# విడిదికి తిప్పలే..

**ఆరేళ్లుగా నత్తనడకన ధర్మశాల నిర్మాణ పనులు**



చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే వారి వసతికి ఈసారీ తిప్పలు తప్పేలా లేవు. 50 గదుల ధర్మశాల నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఆరేళ్లవుతున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. మరో రెణ్నెల్లలో స్వామివారి కల్యాణోత్సవం, అనంతరం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

**ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు..** అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కొమురవెల్లి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు ప్రకటించారు. వాటిలోంచి ధర్మశాల కోసం మొదట రూ.6.80 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో 2018 ఆగస్టులో రూ.6.40 కోట్లకు ప్రభుత్వ అనుమతి లభించింది. గుట్టపై నిర్మిస్తే నిధులు సరిపోవని ఇంజినీర్లు చెప్పడంతో ఆలయ డబ్బులకు కమిషనరు అనుమతి పొందారు. ఆలయ నిధులు మరో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. రూ.3.60 కోట్లతో రోడ్డు పనులు పూర్తి చేశారు. ధర్మశాల నిర్మాణానికి ఆన్‌లైన్ టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు పనులు నెమ్మదిగా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**జాతర ప్రారంభం నాటికి పూర్తి..:** శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ

గుట్టపై చదును చేయడానికే చాలా సమయం పట్టింది. ప్రస్తుతం పనులు తుది దశకు చేరాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే నాటికి ధర్మశాల నిర్మాణం పూర్తి చేస్తాం.

# వరుణుడి కరుణ.. గంగమ్మ పైపైకి

న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్


నిండు కుండలా వ్యవసాయ బావి

**వృద్ధి చెందిన భూగర్భ జల మట్టాలు**

జిల్లాలో భూగర్భ జలమట్టాలు ఆశాజనకంగానే ఉన్నాయి. వర్షాకాలంలో వానలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. జూన్, జులై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేక భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఆగస్టు, సెప్టెంబరులో భారీగా వానలు కురవడంతో కుంటలు, చెరువులు నిండి భూగర్భ జల మట్టాలు వృద్ధి చెందాయి.

**5.60 లక్షల ఎకరాల్లో సాగు..**

ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందుగానే పలకరించిన జులై రెండో వారంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో కుంటలు, చెరువుల్లోకి నీరు సమృద్ధిగా చేరి అలుగులు దూకాయి. జూన్ నెలలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటల సాగుకు అన్నదాతలు ముందుకు రాలేదు. వరినార్లు పోసినా జులై, ఆగస్టులో కురిసిన వర్షాలకు రైతులు పొలాలు దున్ని ఆగస్టు, సెప్టెంబరు రెండో వారం వరకు నాట్లు వేశారు. జిల్లాలో మొత్తం 5.60 లక్షల ఎకరాల్లో అన్నదాతలు వివిధ రకాల పంటలు సాగు చేశారు. వాటిలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి, 1.08 లక్షల ఎకరాల్లో పత్తి, 20వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. మిగతా పొద్దుతిరుగుడు, కంది, పల్లికాయ, అపరాలు సాగు చేశారు.

జిల్లాలో సగటు భూగర్భ జలమట్టాలు (మీటర్లలో)
జులై: 12.50
ఆగస్టు: 11.16
సెప్టెంబరు: 8.76

జిల్లాలో కురిసిన సగటు వర్షపాతం (మి.మీటర్లలో)
జూన్: 141.3
జులై: 199.8
ఆగస్టు: 194.5

**యాసంగికి సమాయత్తం..**

జిల్లాలో భూగర్భ జలమట్టాలు ఆశించిన స్థాయిలో పెరగడంతో ఎలాంటి ఇబ్బందులుండవనే పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో పంటలకు సరిపడా సాగునీరు లభిస్తుందని భావిస్తున్నారు. వరి కోతలు పూర్తి కాగానే యాసంగిలో వరి, ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడుతో పాటు కూరగాయలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**నాలుగు మీటర్ల మేర పెరుగుదల..**

జిల్లాలో వర్షాకాలంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పైకి వచ్చాయి. భూగర్భ జలవనరుల శాఖ అధికారుల నీటి లెక్కల ప్రకారం జిల్లావ్యాప్తంగా 8.76 మీటర్ల లోతులో నీరుంది. అత్యల్పంగా కోహెడ మండలంలో 2.10 మీటర్ల లోతులో, అత్యధికంగా దౌల్తాబాద్ మండలంలో 24.37 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉంది. గత మూణ్నెల్ల గణాంకాలను పరిశీలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు నాలుగు మీటర్ల మేర పెరిగాయి.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మనోహరాబాద్: కోనాయిపల్లికి చెందిన అర్కల బాలేష్(50) శనివారం మద్యం తాగి ఇంట్లో పడుకున్నాడు. ఎంత లేపినా కదలకపోయేసరికి తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలేష్ మరణంపై అనుమానాలున్నట్లు తమ్ముడు పోచాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పంచనామాకు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పరిహారం.. ఆశావహం

**110 కిలోమీటర్లు.. 4,500 ఎకరాలు**



న్యూస్‌టుడే, తూప్రాన్, నర్సాపూర్, గజ్వేల్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. రైతులకు మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం అవుతున్న గ్రామాల్లో భూముల విలువను మూడు రెట్లు పెంచింది. కనిష్ఠంగా ఎకరాకు రూ.4.25 లక్షలు ఉన్న విలువను రూ.16.50 లక్షలకు పెంచింది. రూ.7 లక్షలకు పైగా ఉన్న చోట రూ.20 లక్షల వరకు మార్కెట్ విలువను పెంచింది. వాటి వివరాలను ధరణి వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన విలువల నివేదికను అందజేశారు. వారి నుంచి స్పష్టత రాగానే ఎంత చెల్లించాలనే విషయమై కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

- ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులకు విలువ పెంచి అందించేందుకు చర్యలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,500 ఎకరాల రైతులకు మేలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్తర భాగంలో సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ మండలాల పరిధిలో 110 కిలో మీటర్ల పరిధిలో 4,500 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. భూముల సర్వేను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సిద్ధం చేశారు. కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు, రికార్డులను పరిశీలిస్తున్నారు.

**కొనసాగుతున్న ఆందోళనలు**

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం కానున్న పలు గ్రామాల్లో రైతులు భూనిర్వాసితులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలోని నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో ఎకరాకు ఎక్కడా రూ.కోటికి తక్కువ లేదు. కొన్ని చెరువులు, కుంటలు సమీపంలోని భూముల్లోనూ ఎకరాకు రూ.40 లక్షలపైగా ఉంది. మార్కెట్ విలువలు ఆధారంగా తమకు నష్టపరిహారం



భూయజమానులతో చర్చిస్తున్న ఆర్డీఓ


ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విలువలపై మూడు రెట్లు ఇస్తేనే మార్కెట్ ధర పరిహారం వస్తుందని భూయజమానులు భావిస్తున్నారు.

**ఎవరూ ఆందోళన చెందొద్దు**

తూప్రాన్ డివిజన్ పరిధిలో ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. గతంలో మార్కెట్ విలువను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా పెంచారు. ధరణిలో నమోదై ఉంది. వీలైనంత మేర ఎక్కువ పరిహారం అందించేందుకు చొరవ తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్**

**రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్న విషయాన్ని గుర్తించి మార్కెట్ విలువలను పెంచడం సంతోషకరం. పెంచిన విలువ ఆధారంగానే భూనిర్వాసితులకు తగిన పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. **సత్రు, ఎల్లారెడ్డి గూడెం తండా**

**న్యాయం జరిగే వరకు పోరాటం:**



ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్నాం. ప్రస్తుతం ఉన్న విలువల ప్రకారం తక్కువ పరిహారం వస్తుంది. మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి. లేదంటే మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంటాం. ఇప్పటికే మా గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు భూములు కోల్పోయాం. **యాదయ్య, రెడ్డిపల్లి**

# దేశభక్తి గుర్తింపు.. పోటీలతో పెంపొందు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్‌గాథ-4.0' పేరుతో వీటిని చేపట్టింది. ఇప్పటికే దృశ్యశ్రవణ సమావేశం ద్వారా సూచనలు చేశారు. ముందుగా వెబ్‌సైట్‌లో పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' శీర్షికతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుడి గురించి వ్యాసం రాయడం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది. 6-8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారి త్యాగం గురించి 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9-10వ తరగతి వారు 'రాణీ లక్ష్మీబాయి కలలోకి వస్తే', 'నీవు దేశ సేవ ఎలా చేస్తావు' అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాల్లో వ్యాసం లేదా చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.



వీర్‌గాథ-4.0 పేజీ

**సూపర్ 100 మంది విజేతలయ్యే తీరు**

- జిల్లా స్థాయిలో నలుగురిని ఎంపిక చేస్తారు.
- రాష్ట్ర స్థాయిలో 8 మంది విజేతలు
- జాతీయ స్థాయిలో 100 మంది ఎంపికవుతారు.
- 3వ తరగతి నుంచి 5 వరకు.. 6 నుంచి 8 వరకు.. 9, 10 తరగతుల నుంచి.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఎంపికవుతారు.
- నగదు బహుమతి రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరికి ఇస్తారు.
- పోర్టల్‌లో నమోదుకు గడువు అక్టోబరు 15
- వెబ్‌సైట్ mygov.in పేజీలో 'వీర్‌గాథ' ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి.
- 17వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు జిల్లా స్థాయి, నవంబర్ 12 నుంచి 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4-24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి.

**సద్వినియోగం చేసుకోవాలి:**



జాతీయ స్థాయిలో విద్యార్థుల గుర్తింపు దక్కించుకునేందుకు ఇది చక్కని అవకాశం. పోటీలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా కృషి చేస్తున్నాం. సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో నమోదు జరిగేలా చూస్తాం.

**సుదర్శనమూర్తి, జిల్లా సెక్టోరల్ అధికారి, మెదక్**

## రైతులకు పంట రుణాలు అందించాలి: సీపీఎం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రుణమాఫీ పూర్తయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆదివారం పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా రుణమాఫీ హామీ పూర్తికాలేదని, మాఫీ అయినా చాలా మందికి రుణాలు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందెబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వనదుర్గ వర్చస్సు.. భక్తులకు ఉషస్సు



రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గ



అమ్మవారి పల్లకీ సేవ

పాపన్నపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏడుపాయల ఆలయంలో విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా భక్తుల సందర్శనలతో కిటకిటలాడింది.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గోకుల్‌షెడ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్ద మంజీరా మార్జనం కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా వనదుర్గను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. వాహన పూజలు అధికంగా జరిగాయి.

## దేవీ దర్శనం.. మనసు తన్మయత్వం



న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: ఉత్సవాల చివరి రోజున వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం తెల్లవారుజామున వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శమీ పూజ అనంతరం అమ్మవారు సకల జయాలు సిద్ధింప చేసే రాజరాజేశ్వరి మాతగా భక్తులకు దర్శనమివ్వడంతో తన్మయత్వం చెందారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## త్రిరాత్రోత్సవం సంపూర్ణం



కొమురవెల్లిలో త్రిశూల స్నానం

చేర్యాల, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో త్రిరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. దుర్గాదేవి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రతి ఏటా త్రిరాత్రోత్సవాలలో భాగంగా దుర్గామాతను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దుర్గామాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరులో అర్చకులు త్రిశూలస్నానం చేశారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి పి.మల్లయ్య, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఈశ్వరుడే ఈశ్వరి రూపం



జిన్‌గుర్తిలో..

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే:ఈశ్వరుడు, ఈశ్వరిని వేర్వేరుగా కాకుండా ఒక్కటిగా నిర్వాహకులు అలంకరించారు. భక్తులు దర్శించుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తి రామలింగేశ్వరస్వామిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

## అమ్మ రావాలి.. ఆకలి తీర్చాలి

ఏ ప్రాణియినా తన పిల్లల కడుపు నింపేందుకు పోరాటం చేస్తుంది. కొన్ని స్వయంగా ఆహారం అందిస్తుంటే, మరికొన్ని సేకరించి మరీ అందిస్తాయి. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఓ వెంచర్‌లో చిన్న చెట్టుపై ఓ పక్షి గూడు పెట్టింది. అందులో రెండు పిల్లలు ఉండగా, వాటికి ఆహారం తెచ్చేందుకు తల్లి పక్షి ఎటో వెళ్లింది. ఆ సమయంలో పిల్ల పక్షులు ఆకలేసి అరుస్తుండగా 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. కాసేపటికి తల్లి పక్షి ఆహారం తీసుకురాగా పిల్లలు అరుపులు మానేశాయి. **న్యూస్‌టుడే, తూప్రాన్**



## ఉత్సవాల్లో అపశ్రుతి

### విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక



కీర్తన్య

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిమజ్జనానికి దుర్గామాతను ఊరేగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై బాలిక శిక కీర్తన్య(8) దుర్మరణం చెందింది. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో జరిగింది. దసరా పండగ పూట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన తిరుపతి, మౌనిక దంపతులకు కూతురు కీర్తన్యతో పాటు కుమారుడు ఉన్నారు. వారిది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో ఒక దుర్గామాత విగ్రహాన్ని శనివారం రాత్రి ఊరేగించారు. డీజేతో నృత్యాలు చేస్తుండగా చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. డీజే పరికరాలకు ఉపయోగించిన తీగ కొంచెం తెగిపోయి నేలపై పడి ఉంది. ఎవరూ గమనించలేదు. ఇంతలో బాలిక కీర్తన్య వచ్చి ఆ తీగపై అడుగేయగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన స్థానికులు వైరును తొలగించారు. బాలికను నంగునూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందింది. చలాకీగా ఆడుతూ పాడుతూ ఉండే బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు తట్టుకోలేక పోతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ విజయభాస్కర్, విద్యుత్తు సిబ్బంది సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## పండక్కి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



మొగులప్ప

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బుర్రితండా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చింతల్‌దిన్నెకు చెందిన మొగులప్ప(40) హైదరాబాద్‌లో మేస్త్రీ పనులు చేస్తుంటాడు. ఆదివారం పండుగ కోసం బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా.. బుర్రితండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. మొగులప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. తండ్రి ఆశప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొగులప్పకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

### మొక్కజొన్న పొలానికి కాపలా వెళ్లిన రైతు..

పెద్దేముల్, న్యూస్‌టుడే: పొలం వద్ద కాపలాకు వెళ్లిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దకురువ బాలప్ప (38) శుక్రవారం రాత్రి తన మొక్కజొన్న పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గ్రామానికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలప్ప చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య అంజిలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## మద్యం మత్తులో గొడవ.. స్నేహితుడి దారుణ హత్య



నదీమ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేర గ్రామానికి చెందిన అక్బర్‌పాషా, షాహిన్‌బేగం దంపతులు 40 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి జగద్గిరిగుట్ట పరిధి దీనబంధు కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు నదీమ్(21). అక్బర్ పాషా మసీదులో పనిచేస్తున్నాడు. తరచూ స్నేహితులతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి జన్మదిన వేడుకలకు వెళ్లి మద్యం తాగాడు. రోడ్డుపై స్నేహితులతో కలిసి గొడవ పడడంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనంతరం కొంతమంది నదీమ్ ఇంటికి వెళ్లి బయటకు పిలిచి గొడవపడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో ఇనుపరాడ్‌తో నదీమ్ తలపై కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపు మడుగులో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోదరి ఫిర్యాదు మేరకు అనుమానితుడు ఖలీల్‌తోపాటు మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బలవన్మరణం.. కుటుంబాలు అతలాకుతలం

సమస్యలను అధిగమిస్తూ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తులు కొందరు బాధలను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ముగ్గురు పండుగ రోజుల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగిల్చారు.

### పెళ్లి కావడం లేదని.. యువకుడి ఆత్మహత్య



అనిల్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పెళ్లి కుదరడం లేదని అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కాళ్లకల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ (28)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరటం లేదు. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలో ఓ ప్రమాదంలో పైనుంచి కింద పడగా ఒక మూత్రపిండం తొలగించారు. తరచుగా అనారోగ్యానికి గురవుతుండటంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

### మద్యం తాగొద్దన్నందుకు డ్రైవర్..

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానివేయాలని కుటుంబ సభ్యులు సూచించడంతో.. ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(32) జీవనోపాధి కోసం గుండ్లపోచంపల్లిలో ఆరు నెలలుగా కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆటో నడపడంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. మద్యం తాగుతుండటంతో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ విషయమై మరోమారు గొడవ జరగడంతో ఆటోలో రామాయంపేట మండలం అక్కన్నపేటకు వచ్చి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు.

### అలవాటు మానలేక మెకానిక్ ..

హుస్నాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానేసేందుకు చికిత్స తీసుకున్నా .. అలవాటు మానక దానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగింది. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా ద్విచక్ర వాహన మెకానిక్ దగ్గర పని చేసిన నమిలికొండ రాజేందర్ (43)కు భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. చికిత్స కేంద్రం నుంచి తిరిగి వచ్చి మళ్లీ తాగుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అదృశ్యమై.. విగతజీవిగా మారి..



మోహన్

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా మారిన ఘటన నర్సాపూర్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఒంటెద్దు(మందుల) మోహన్(35) ఈనెల 10వ తేదీన పనిపై బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరుసటి రోజు మోహన్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం నర్సాపూర్‌లోని పందివాగులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం మోహన్‌దిగా గుర్తించారు. అతడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్ స్థానికంగా ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

## ప్రదర్శన వైవిధ్యం.. అవగాహన అనునిత్యం

- ఉత్తరాది ప్రజల శైలిపై అధ్యయనంతో విద్యార్థులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం

దేశంలో అన్ని రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ఒకే విధంగా ఉండవు. తెలుగు రాష్ట్రాలతో పోల్చితే ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల్లోనివి భిన్నంగా ఉంటాయి. వీటన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాశాఖ ఇటీవల 'భారతీయ కళా మహోత్సవ్' పేరిట ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించింది. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి భిక్షపతి ఆధ్వర్యంలో హైదరాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈనెల 6 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహించారు. అక్కడి ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులను తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, సిద్దిపేటలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ నెల 5న సందర్శించారు.



అక్కడి ప్రజలు ధరించే టోపీలు



ఈశాన్య రాష్ట్ర వాసులతో విద్యార్థులు

**పుస్తకాల్లో చదివినవి ప్రత్యక్షంగా చూశా**

– గడిపె సుజిత్, బీకాం ద్వితీయ

ఈ ప్రదర్శన చాలా బాగుంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం గురించి తెల్సుకున్నా. తెలుగు ప్రజలతో పోల్చితే వారి జీవన విధానం, పద్ధతులు, తీసుకునే ఆహారం తదితర అంశాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నా. అవకాశం కల్పించిన ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు.

**నల్లటి బియ్యంతో అన్నం**

– చెన్నూరి జ్యోతి, బీజడ్‌సీ ద్వితీయ

రాష్ట్రపతి నిలయంలో వివిధ రాష్ట్రాల గురించి తెల్సుకున్నా. అందులో ఉత్తర భారతంలోని రాష్ట్రాల ప్రజల జీవన విధానం, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కళలు, నృత్యాలు ప్రదర్శించారు. వంట పాత్రలు కలపతో చేసినవి ఉంటాయి. బియ్యంతో చేసిన అన్నం తినడం తక్కువ. నల్లటి బియ్యాన్ని సొంతంగా పండించుకొని వాటినే అన్నం చేసుకొని భోంచేస్తారు. చపాతీల వాడకం ఎక్కువ.

**కర్రలు, గడ్డితో ఇళ్లు**

– ఎండీ సమీనా, బీఏ ద్వితీయ

ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఇళ్లు, ఉపయోగించే వివిధ రకాల పరికరాలు, దుస్తుల గురించి తెల్సుకున్నా. కర్రలు, గడ్డితో నిర్మించిన ఇళ్లలో అక్కడి ప్రజలు నివసిస్తున్నారు. వారి భాష భలేగా ఉంది. విభిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడం కొత్త అనుభూతి కలిగించింది.

**ప్లాస్టిక్ గ్లాసులు లేవు**

– జక్కు క్రాంతి, బీఎస్సీ తృతీయ

అధ్యాపకుడు చుక్క రమేశ్‌తో కలిసి వెళ్లాం. ఈశాన్య రాష్ట్రాల ప్రజల జీవనశైలి విభిన్నంగా ఉంటుందని తెలుసుకున్నా. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడరు. లోహం, కలప, చెట్టు భాగాలతో చేసినవి వినియోగిస్తారు. నీళ్లను కర్ర పాత్రలో నుంచి తాగుతారు. బంగారం, వెండి ఆభరణాలు వేసుకోవడం తక్కువ. పూసలు, దారాలు, కర్రతో తయారు చేసిన ఆభరణాలు ధరిస్తారు. నృత్యాలు విభిన్నం.

## స్నానానికి వెళ్లి.. నీట మునిగి ఇద్దరు మృతి



సంగెం విఠల్

పుల్కల్, బషీరాబాద్, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన జరిగింది. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. సింగూరు గ్రామానికి చెందిన సంగెం విఠల్ (40) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 11న ప్రాజెక్టు దిగువ భాగాన స్నానం చేయడానికి దిగి మునిగిపోయాడు. ఆ సమయంలో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటి విడుదల కొనసాగుతుండడంతో పాటు జల విద్యుత్తు కేంద్రం ద్వారా నీరు దిగువకు వెళుతోంది. సమాచారం తెలిసిన వెంటనే అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం విఠల్ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గేట్ల వద్ద మృతదేహం కనిపించింది. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్ఐ గఫార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిఘనాపూర్‌కు చెందిన అశోక్ (38) వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గామాత ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆదివారం అక్కడే చెరువులో ఈతకు వెళ్లాడు. ఈదుతుండగా బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న కొందరు వెతికి తీసేసరికి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

| చికెన్ ధరలు | | | |
|---|---|---|---|
| ఫాంరేటు | 126–00 | డ్రెస్డ్ | 215–00 |
| రిటైల్ | 148–00 | స్కిన్‌లెస్ | 244–00 |

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ఘనస్వాగతం



బండి సంజయ్‌తో స్థానిక భాజపా నాయకులు

చేర్యాల, న్యూస్‌టుడే: కేంద్రమంత్రి బండి సంజయ్‌కి చేర్యాల, కొమురవెల్లి నాయకులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరులో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు చేర్యాల మీదుగా వెళ్తున్న ఆయనకు రహదారి పక్కన స్థానిక నాయకులు పూలు చల్లుతూ స్వాగతించారు. దీంతో ఆయన కాసేపు చేర్యాల శివారు కొమురవెల్లి స్వాగత తోరణం, చేర్యాల పట్టణం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కారు ఆపారు. స్థానిక నాయకులు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. అయితే మంత్రి స్థానికంగా మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

## గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన కేడం లింగమూర్తిని క్రీడా సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. స్వతహాగా క్రీడాకారుడు కావడంతో వివిధ పదవులు చేపట్టి ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారన్నారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, కనకరాజు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత

దుబ్బాక, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దచీకోడ్‌లో శనివారం సల్మెడ సిద్ధిరాములకు చెందిన పాడి గేదె గ్రామ శివారులోని పంట పొలంలో మేత మేస్తూ విద్యుత్తు నియంత్రిక వద్ద తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# అన్నదాత చూపు.. ఆరుతడి వైపు

### తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగు

న్యూస్‌టుడే, గజ్వేల్: అందుబాటులో ఉండే నీటివనరులను సద్వినియోగం చేసుకుంటేనే పంటల సాగులో అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. అధిక తడులు అవసరమయ్యే పంటలు సాగుచేస్తే చేతికందే సమయంలో నీటిఎద్దడి ఏర్పడి ఎండిపోయే ప్రమాదముంది. అందుకే ఆరుతడి పంటల వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో చాలామంది రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పలు రకాల కూరగాయలు, వాణిజ్య పంటలు సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

### నీటిని పొదుపుగా వాడుకుంటూ..

జిల్లాలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ మొదలైన ప్రాజెక్టుల్లో గోదావరి జలాల నిల్వ కారణంగా బోరు బావుల్లో కావాల్సినంత నీరున్నా ఫాంపాండ్‌లలో నిల్వ చేసుకుంటున్నారు. వరికి బదులు మొక్కజొన్న, తీపి మొక్కజొన్న, బెండ, సొర, చిక్కుడు, బీన్స్, బీర, కాకర, టమాట, పొట్ల, వంకాయ మొదలైన పంటలు పండిస్తున్నారు. నిరంతర విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నదాతలు ఆ దిశగా ముందుకు సాగుతున్నారు.

### ముందస్తు ఒప్పందం

గజ్వేల్ వర్గల్, ములుగు, మర్కూక్, కొండపాక, తొగుట, చిన్నకోడూరు, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లోని రైతులు ఎక్కువగా కూరగాయలు, వాణిజ్య పంటలు పండిస్తున్నారు. దుక్కి దున్నకం, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు మొదలైనవాటికి కలిపి ఏటా 25 శాతం మేరకు సాగుఖర్చులు పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. సంప్రదాయ పంటలకు చీడపీడలు ఆశించకుండా మంచి దిగుబడి వస్తేనే సాగు గిట్టుబాటవుతుందని, ఆరుతడిలో తక్కువ శ్రమ, ఎక్కువ లాభం ఉంటుందన్నారు. ఇక్కడ పండించే పంటలను హైదరాబాద్ తరలించే వీలుండడం, ములుగు మండలం వంటిమామిడి వద్ద మార్కెట్ ఉండడంతో రైతులకు కలిసి వస్తోంది. పలు కార్పొరేట్ సంస్థలు ముందస్తు ఒప్పందంతో రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్నాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలకు కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి.



గజ్వేల్ శివారులో ఫాంపాండ్‌లో నిల్వ చేసిన నీరు

**జిల్లాలో సాగు వివరాలు**

- కూరగాయలు పండించే రైతులు: 25 వేలు
- పంటల విస్తీర్ణం: 15 వేల ఎకరాలు
- ఎకరాకు సాగు ఖర్చు: రూ. 25-30వేలు
- ఆదాయం: రూ.25-30వేలు
- సగటు దిగుబడి రోజుకు: 10 మె.ట.

### చేయూతనిస్తే మరింత వృద్ధి

రైతులకు తుంపర, బిందు సేద్య పరికరాలు రాయితీపై ఇచ్చి ప్రోత్సహిస్తే అధిక మొత్తంలో కూరగాయలు పండించేందుకు కర్షకులు సిద్ధంగా ఉన్నారు. వ్యవసాయాధికారులు పంటల సాగులో విత్తనం మొదలుకొని సాగు, సస్యరక్షణలో అవసరమైన సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తే బావుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా**

సిద్దిపేట టౌన్ 9963585053 | జగదేవపూర్ 8008573209 | హుస్నాబాద్ 8008573520 | దుబ్బాక 9030037175 | చేర్యాల 8008574871 | గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, చేర్యాల, బెజ్జంకి, మిరుదొడ్డి:

? చేర్యాల పట్టణంలోని 2వ వార్డులో మురుగునీరు కాల్వ మధ్యలోనే నిలిచి కంపుకొడుతోంది. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. – శ్రీకాంత్, చేర్యాల

✓ సమస్యను గుర్తించి కొత్తగా కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. – చెవిటి లింగం, 2వ వార్డు కౌన్సిలర్, (చేర్యాల మున్సిపాలిటీ)

? మిరుదొడ్డి మండలం కాసులాబాద్ మీదుగా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి వెళ్లే రహదారి గుంతలుగా మారింది. వెంటనే మరమ్మతులు చేపట్టాలి – బాలరాజు, కాసులాబాద్

✓ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. – రిజ్వాన్, పంచాయతీరాజ్ శాఖ, ఏఈ, మిరుదొడ్డి

? మండల కేంద్రంలో పంచాయతీ ఆధీనంలోని మూత్రశాలల ఎదుట మురుగు కాలువకు పలు చోట్ల పైకప్పు లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. – అంజి, స్థానికుడు

✓ మురుగు కాలువ పైకప్పు శిథిలమై పలుచోట్ల కూలింది. పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపడతాం – ప్రణీత్, పంచాయతీ కార్యదర్శి

? రహదారి విస్తరణలో భాగంగా బేగంపేట శివారులో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర పోసి వదిలేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – శేఖర్‌బాబు, బేగంపేట

✓ త్వరతగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. – సాజిద్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

## 'మల్లన్న' సన్నిధిలో న్యాయమూర్తి పూజలు



మల్లికార్జునస్వామిని దర్శించుకొన్న మంథని కోర్టు న్యాయమూర్తి స్వాతి దంపతులు

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని విజయదశమి రోజున పెద్దపల్లి జిల్లా మంథని కోర్టు న్యాయమూర్తి మొగుళ్ల స్వాతి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో శనివారం ఆలయానికి వచ్చిన ఆమె ఆలయ గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# వైభవంగా విజయదశమి వేడుకలు



బెజ్జంకి: రేగులపల్లిలో పాల్గొన్న మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



చంద్లాపూర్‌లో భారాస రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, తదితరులు



భూంపల్లిలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య తదితరులు

సిద్దిపేట అర్బన్, ములుగు, దుబ్బాక, హుస్నాబాద్ గ్రామీణం, నంగునూరు, రాయపోల్, దౌల్తాబాద్, గజ్వేల్, గ్రామీణం, తొగుట, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు చోట్ల రావణసుర ప్రతిమలను దహనం చేశారు. దుబ్బాక మండలం పోతారంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. దుబ్బాకలో పురాధ్యక్షురాలు వనిత ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. నంగునూరు మండలం రాంపూర్‌లో రెండు పార్టీల నాయకుల మధ్య వివాదం తలెత్తింది. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్సై ఎండీ ఆసిఫ్ సిబ్బందితో చేరుకొని సర్దిచెప్పారు. బెజ్జంకి మండలం రేగులపల్లిలో జరిగిన వేడుకలకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. గుండారంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు భారాస నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. తొగుట మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



కొమురవెల్లి ఆలయంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో, ఏఈవో, గ్రామస్థులు



సిద్దిపేట టౌన్: సిద్దిపేటలో లాల్ కమాన్‌వద్ద మహర్షి యూత్ ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు

# దుష్టసంహారిణి.. దుర్గారూపిణి



గజ్వేల్‌లో దుర్గామాత శోభాయాత్ర



దుబ్బాక: అమ్మవారి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



రాయపోల్: తిమ్మక్కపల్లిలో పూజల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



మర్పడ్గలో విజయదుర్గ అమ్మవారు

దుబ్బాక, గజ్వేల్ గ్రామీణ, రాయపోల్, కొండపాక గ్రామీణం, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఊరూరా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలు ఆలయాలు, మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. రాయపోల్ మండలం తిమ్మక్కపల్లిలో అమ్మవారిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దర్శించుకున్నారు. కొండపాక మండలం మర్పడ్గలో నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు సాగిన నవావరణయాగం పూర్ణాహుతితో పరిపూర్ణమైంది. దుర్గామాత అమ్మవారిని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం):హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్), అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామాల్లో ఈ నెల 14న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి హాజరవుతారన్నారు.

## విగ్రహానికి అవమానంపై ఆందోళన

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపూర్‌లోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామానికి చెందిన ఓ యువకుడు అవమానించారంటూ అంబేడ్కర్, ఇతర యువజన సంఘాల సభ్యులు ఆదివారం ఆందోళన చేపట్టారు. విగ్రహాన్ని అవమానించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. విషయాన్ని గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులకు తెలుపగా అక్కడికి చేరుకొని సదరు యువకుడిని పిలిపించారు. విగ్రహం వద్ద క్షమాపణ చెప్పించాలని యువజన సభ్యులు డిమాండ్ చేయగా.. యువకుడు నిరాకరించడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఠాణాలో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఏఎస్సై శంకర్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని కార్యాలయ ఆవరణలో విచారణ చేపట్టారు. అనంతరం సీఐ యువకుడిని పిలిపించి విగ్రహానికి క్షీరాభిషేకం చేయించారు. పూలమాల వేసి నివాళులర్పింపజేశారు. యువజన సభ్యులు శాంతించి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా గ్రామస్థులంతా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.

# అంతర్గత దారులు అధ్వానం

**ఏళ్లుగా కాలనీ వాసుల ఇబ్బందులు**

న్యూస్‌టుడే, చేర్యాల: చిన్న వాన పడిందంటే చాలు కొమురవెల్లి మండలం గౌరాయపల్లి ఎస్సీకాలనీ వాసుల్లో వణుకు మొదలవుతుంది. చిరుజల్లులకే దారులన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అంతర్గత రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. కనీసం బయటకు రావాలన్నా తిప్పలు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి తారురోడ్డు కాగా, అనేక వాడల్లో సీసీ రోడ్లు వేశారని, దళితవాడలో మాత్రం కనీసం మొరం పోసే దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో మురుగు కాలువలు నిర్మించలేదని, దీంతో వర్షం నీరు గుంతల్లో నిలిచి దోమలకు ఆవాసంగా మారాయని, రాత్రిపూటే కాకుండా పగలు సైతం దోమల బెడద ఎక్కువగా ఉందని కాలనీవాసులు తెలిపారు. భారీ వర్షాలు పడితే వీధుల్లోని నీరు ఇళ్లలోకి చేరుతోందని వాపోతున్నారు.



ఎస్సీ కాలనీలో బురదగా మారిన దారులు

**సీసీ రోడ్డు నిర్మించాలి: తాడూరి యాదగిరి, గౌరాయపల్లి**

తమ సమస్యను అనేక ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు వచ్చి హామీలు ఇస్తున్నారు తప్ప.. ఏమీ చేయడం లేదు. చిన్నపిల్లలు బడికి వెళ్లడానికి సైతం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి.

**మొరం పోయిస్తాం:**

కాలనీలో రోడ్లన్నీ బురదగా ఉన్న మాట నిజమే. నిధులు లేక పనులు చేపట్టలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మొరం పోయిస్తా. మహేందర్, కార్యదర్శి, గౌరాయపల్లి



## ప్రొ.సాయిబాబా ఆశయ సాధనకు కృషి



గజ్వేల్‌లో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

గజ్వేల్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, దళిత ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు ఎల్లయ్య తదితరులు మాట్లాడుతూ.. దివ్యాంగుడైన సాయిబాబా పేద ప్రజల గొంతుకై నిలిచాడన్నారు. సాయిబాబా ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మావోయిస్టులకు సానుభూతిపరుడనే నెపంతో ఆయనను జైల్లో పెట్టి, ఆరోగ్యం దెబ్బతినేలా చేయడం వల్లనే మృతి చెందాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, హయత్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: సాయిబాబా మృతిపై హుస్నాబాద్‌లో ప్రజా సంఘాలు సంతాపాన్ని వ్యక్తం చేశాయి. ఆదివారం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదరిక నిర్మూలనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులు మేకల వీరన్న యాదవ్, ముక్కర సంపత్, కోయ్యడ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు. సాయిబాబా మరణం పీడిత ప్రజా ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ పేర్కొన్నారు.

## భారాస హయాంలో మైనార్టీలకు పెద్దపీట: వంటేరు



మైనార్టీ నాయకులతో ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీట వేశారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. దసరా పండుగ పురస్కరించుకొని శనివారం సాయంత్రం గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలకు ప్రత్యేక గౌరవం ఇచ్చారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి భారాసకు పూర్వవైభవం తీసుకొద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖాజా విరాసత్ అలీ, గజ్వేల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకియొద్దీన్, పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ తంజీముల్ మజీద్ కమిటీ మాజీ సదర్ యుసూఫుద్దీన్, రాష్ట్ర మైనార్టీ హజ్ కమిటీ మెంబర్ జాఫర్ ఖాన్, మైనార్టీ అప్షన్ సభ్యులు, తదితరులున్నారు.

## తిరిగొచ్చేందుకు తిప్పలు



బతుకమ్మ, దసరా పండుగలకు పట్టణాల నుంచి పల్లెలకు వెళ్లిన ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఉత్సవాలు జరుపుకొన్నారు. అనంతరం ఆదివారం పట్టణానికి తిరుగు ప్రయాణం కావడంతో బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో వందలాది మంది రోడ్లపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూశారు. సరిపడా బస్సులు లేవని హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డుపై నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. అధికారులు మరిన్ని బస్సులు వేయాలని కోరారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిద్దిపేట టౌన్: అనుమానాస్పద వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. ముఖ్యంగా యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా కేవలం చదువులపై దృష్టి సారించాలన్నారు. పట్టణంలోని కేసీఆర్ నగర్‌లో టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు.

## దాడి ఘటనలో పలువురిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం కుందన్‌వానిపల్లిలో ఓ ఇంటిపై దాడిచేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 12న మధ్యాహ్నం వంశీతో పాటు అతని స్నేహితులు బంజారాహిల్స్ తండా వద్ద ఉన్న మద్యం గొలుసు దుకాణానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగుతుండగా కుందన్‌వానిపల్లికి చెందిన ఏలేటి రాజిరెడ్డి, వారికి మధ్య గొడవ జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని వంశీతో పాటు అక్కన్నపేటకు చెందిన మరికొందరు యువకులు సాయంత్రం రాజిరెడ్డి ఇంటిపైకి వచ్చి దాడి చేశారు. తమ ఇంటికి వచ్చి దాడిచేసి కొట్టారని పేర్కొంటూ రాజిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

**మరో ఘటనలో..**

అక్కన్నపేట మండలం రామవరంలోని ఓ కిరాణం దుకాణంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 12న దసరా పండగ రోజు తాగిన మైకంలో తమ దుకాణానికి వచ్చి దాడి చేశారని పేర్కొంటూ యజమాని రజిత ఫిర్యాదు చేసిందన్నారు.

## వైద్య విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినుల తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న యాళ్ల చంద్రారెడ్డి

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతుల కుమార్తెలు(కవలలు) రోహిణి, రోషిణీలు ఇటీవల జగిత్యాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కళాశాలలో ప్రవేశాలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్‌కు చెందిన కోఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ యాళ్ల చంద్రారెడ్డి స్పందించారు. చంద్లాపూర్‌లో ఆదివారం రామచంద్రం, శారద దంపతుల కుమార్తెలకు ఆర్థిక సాయంగా రూ.50వేల చెక్కు అందజేశారు. మాజీ ఉపసర్పంచి వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులున్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం గుడాటిపల్లి పరిధిలోని జాలుబాయితండాలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన గుగులోతు తిరుపతి కుటుంబానికి అతని బాల్యమిత్రులు రూ.22వేల నగదు, 25కిలోల బియ్యాన్ని ఆదివారం తిరుపతి తల్లిదండ్రులకు అందించారు.

జగదేవపూర్: మండల పరిధి పలుగుగడ్డకు చెందిన గురజకుంట పరమేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతని బాల్యమిత్రులు రూ.17,500 నగదును ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

## రెండు కార్లు ఢీ.. ఏడుగురికి గాయాలు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన సిద్ధూ, హరి, ఉదయ్, సాయి, సందీప్ ఏడుపాయల దుర్గామాత ఆలయానికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మెదక్‌కు చెందిన సమియుల్లాఖాన్, రహమతున్నీసా దంపతులు డ్రైవర్ అయూబ్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి మెదక్ వెళుతున్నారు. ఈ క్రమంలో రెడ్డిపల్లి సమీపంలో రెండు కార్లు ఢీకొనడంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవరు అయూబ్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గాయపడిన కొందరిని 108 వాహనంలో, మరికొందరిని ప్రైవేటు వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని పలు ప్రయివేటు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.